క్లుప్తంగా

ఘనంగా చక్రస్నానం

మదనపల్లె సిటీ: శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్థానిక సొసైటీకాలనీలోని రామాలయంలో బుధవారం చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో హోమం, మహా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం ధ్వజ అవరోహణంతో ఉత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌కు దారి ఇవ్వలేదని వివాదం



డ్రైవర్‌ను ప్రశ్నిస్తున్న బాలాజీ

మదనపల్లె సిటీ: అంబులెన్స్‌కు ఆర్టీసీ అద్దె బస్సు దారి ఇవ్వకపోవడంపై వీహెచ్‌పీ నాయకుడు బాలాజీ అడ్డుకున్నాడు. బుధవారం స్థానిక మల్లికార్జున సర్కిల్ నుంచి అంబులెన్స్ జిల్లా ఆస్పత్రికి వెళుతుండగా మదనపల్లె-తంబళ్లపల్లె అద్దె బస్సు అంబులెన్స్‌కు దారి ఇవ్వలేదు. దీంతో అక్కడ ఉన్న బాలాజీ బస్సు డ్రైవర్‌ను అంబులెన్స్‌కు ఎందుకు దారి ఇవ్వలేదని ప్రశ్నించాడు. దీంతో ఇరువురి మధ్య వివాదం జరిగింది. ఈ విషయంపై బాలాజీ డీఎంకు ఫిర్యాదు చేశాడు.

రేపు మండల్ మీట్

పెద్దతిప్పసముద్రం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల్ మీట్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ పేర్కొన్నారు. సమావేశానికి ప్రజా ప్రతినిధులు తప్పక హాజరు కావాలన్నారు. అలాగే అన్ని శాఖల మండల స్థాయి అధికారులు సమగ్రమైన ప్రగతి నివేదికలతో రావాలని ఎంపీడీఓ సూచించారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



మాట్లాడుతున్న సర్పంచ్ హబీబ్‌బాషా

పీలేరు రూరల్ : వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో వాటర్‌మెన్‌లకు, పారిశుద్ధ్య కార్మికులకు, ఎలక్ట్రీషియన్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్యపై ప్రజల నుంచి పలు ఫిర్యాదులు వస్తున్నాయని, గేటు వాల్వులు, పైపులైన్ల మరమ్మతు పనులు చేపట్టి నాలుగు రోజులకోసారి తాగునీరు అందించాలన్నారు. అదే విధంగా డ్రైనేజ్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వీధిలైట్లు లేని ప్రాంతాల్లో సత్వరమే వీధి లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు శ్రీనాథరెడ్డి, వెంకటరమణారెడ్డి, అబీద్, పరమేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో జిల్లా జట్టు ప్రతిభ



కోచ్‌లతో హాకీ సబ్ జూనియర్స్ జిల్లా జట్టు

మదనపల్లె సిటీ: ధర్మవరంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి హాకీ సబ్ జూనియర్స్ పోటీల్లో జిల్లా జట్టు ప్రతిభ కనబరిచారు. జిల్లా జట్టు మూడవ స్థానం కైవసం చేసుకున్నట్లు ది హాకీ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, కోశాధికారి ప్రసాద్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈనెల 6వతేదీ నుంచి నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుంచి 16 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. అన్ని మ్యాచ్‌ల్లో ప్రతిభ కనబరిచారన్నారు. గుంటూరు జట్టుతో జరిగిన మ్యాచ్‌లో 6-1 స్కోరుతో విజయం సాధించారన్నారు. జిల్లా జట్టుకు ట్రోఫీతో పాటు మెడల్స్‌ను రాష్ట్ర మంత్రి సత్యకుమార్‌యాదవ్ చేతుల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో కోచ్ నౌషాద్, ఆదిత్య కాలేజీ పీడీ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను హాకీ జిల్లా కార్యవర్గం సభ్యులు అభినందించారు.

హోరాహోరీగా అండర్-16 క్రికెట్ టోర్నమెంట్

మదనపల్లె : కేఎస్ఎస్‌బీ క్రికెట్ క్లబ్, మదనపల్లె క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో కేఎస్ఎస్‌బీ ఫరీద్‌బాబా జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న అండర్-16 ఉచిత క్రికెట్ టోర్నమెంట్ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. ఈనెల 5న ప్రారంభమై 40 రోజుల పాటు జరగనున్న టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక నుంచి 12 జట్లు పాల్గొంటున్నట్లు క్లబ్ సెక్రటరీ కేఎస్ఎస్‌బీ.ఖాదర్‌బాషా తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..ప్రతి మ్యాచ్ రెండురోజులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కేఎస్ఎస్‌బీ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-16 టోర్నమెంట్‌కు ఎటువంటి ఫీజు లేకుండా క్రీడాకారులకు ఉచిత వసతి, ఉచిత భోజనం కల్పిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు ఫోన్‌నెంబర్ 7680987892 సంప్రదించాలన్నారు.

దేవదాయ వేలం పారదర్శకంగా జరిగేనా?

- మూడు నెలలు ముందు నిర్వహించాలన్న నిబంధన గాలికి
- 29న ప్రకటించి నేడు హడావుడిగా వేలం నిర్వహణ
- ఆరోపణల అధికారికే వేలం నిర్వహణ బాధ్యత



గ్రామదేవత మాన్యం భూమిలో ఇసుక పరిశ్రమ



ఆలయానికి చెందిన మెయిన్‌రోడ్డుపై వాణిజ్య గదులు

బి.కొత్తకోట: బి.కొత్తకోటకు చెందిన పురాతన ఆలయాలకు కోట్ల రూపాయల విలువజేసే భూములు, రూ. కోట్ల డిపాజిట్లు బ్యాంకుల్లో ఉన్నాయి. వాటిపై వస్తున్న వడ్డీ ఏమవుతోంది? ఎవరు ఖర్చు పెడుతున్నారు.. ఎంత ఖర్చు పెడుతున్నారు? ప్రభుత్వం నుంచి ఎంత నిధులు వస్తున్నాయి అన్న కనీస సమాచారం ఎవరి వద్దా లేదు. ఎందుకంటే దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ఈ వ్యవహారాలన్నింటిని గోప్యంగా ఉంచడమే కాకుండా ఏ మేరకు నిధులు ఖాళీ అయిపోతున్నాయో ఎవరికి తెలియడం లేదన్నది ఒకటైతే.. తెలియజెప్పడం లేదన్నది మరో వాదన. ఇన్ని విమర్శల మధ్య గ్రామదేవత ఆలయానికి చెందిన వాణిజ్య గదులు, భూముల లీజు వేలంపై అందరికీ ఆసక్తి నెలకొంది.

హడావుడిగా వేలం ప్రకటన

ఈ పరిస్థితుల్లో గురువారం బి.కొత్తకోట గ్రామదేవత దేవస్థానానికి చెందిన మెయిన్‌రోడ్డుపై ఉన్న వాణిజ్య దుకాణాల లీజు అప్పగింత, సర్వేనంబర్ 326లోని 2.54 ఎకరాలు, సర్వే నంబర్ 329లోని 7.35 ఎకరాలను లీజుకు ఇచ్చేందుకు వేలం నిర్వహిస్తున్నారు. అయితే ఈ వేలం వ్యవహారమంతా అనుమానాలు, ఆరోపణలతో నిండిపోతోంది. వేలం నిర్వహణ విషయం ప్రజలందరికి తెలియజేయలేదు. ఒకపత్రాలు కొందరికి పంచిపెట్టి నిర్వహణకు సిద్ధమయ్యారు. పత్రికా ప్రకటన ఇవ్వకుండా జాగ్రత్త పడటంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కేవలం వాణిజ్య సముదాయంలో ఉంటున్న వారికి, భూముల్లో వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించుకుంటున్న వారికి మాత్రమే తెలిసేలా కరపత్రాలు పంపిణీ చేశారు. దీంతో అందరికీ ఈ సమాచారం చేరలేదు.

అవి వాణిజ్య భూములు

గ్రామదేవత ఆలయానికి చెందిన ఈ భూములు ఎక్కడో మారుమూలన లేవు. పట్టణ నడిబొడ్డున బెంగళూరురోడ్డుపైనే ఉన్నాయి. ఇందులో ప్రస్తుతం పంటల సాగులేదు. 20 ఏళ్లకుపైబడి ఇందులో వాణిజ్య కార్యకలాపాలు సాగుతుండగా దేవదాయశాఖ అధికారులు ఇప్పటిదాక ఇక్కడి భూమిని వినియోగించుకుంటున్న వారి నుంచి ఎంత ఫీజు వసూలు చేస్తున్నారనే పక్కా లెక్కలు ఇప్పటిదాక లేవు. దీనితో యథావిధిగా సాగుభూమి పేరిట లీజుకు నామమాత్రపు సొమ్ముతో కట్టబెట్టేసి ఆ తర్వాత లీజు పొందిన వారి ద్వారా భూముల్లో వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించుకుంటున్న వారి నుంచి భారీ మొత్తంలో నెలవారీ ఫీజును వసూలు చేసుకునే తెరవెనుక వ్యవహారం నడుస్తోంది. తద్వారా లక్షల సొమ్ము చేతులు మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఓ అధికారి ఇక్కడి వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారి నుంచి లక్షలు వసూలు చేసిన స్వాహా చేశారన్న ఆరోపణపై విచారణ కూడా జరిగింది. ఈ పరిస్థితుల్లో భూముల వేలం వ్యవహారంపై అందరి దృష్టి నెలకొంది. సాగుభూమి పేరిట లీజు ఇచ్చి లక్షలు కాజేస్తారా లేక వాణిజ్య పరంగా గుర్తించి భూమి వినియోగించుకుంటున్న వారినుంచి అధికారిక అద్దె వసూలు చేస్తారా అన్నది తేలాలి.

లీజు దక్కించుకున్నా మోసమే..

గ్రామదేవత ఆలయం పక్కనే ఉన్న వాణిజ్య సముదాయంలో ఏడు అద్దె గదులు ఉన్నాయి. వీటి వేలం ఏనాడూ పారదర్శకంగా జరిగిన దాఖలాలు లేవని స్థానికులు అంటున్నారు. గత లీజు వేలం సందర్భంగా కొందరు గదులను దక్కించుకున్నారు. వీటిని అధికారులు పాత లీజుదారులను ఖాళీ చేయించి అప్పగించాల్సి ఉన్నా అలా చేయలేదు. పాతలీజుదారు కోర్టును ఆశ్రయించే వరకు నిర్లక్ష్యం ఉండి లీజుదారునికి గది దక్కకుండా చేశారు. ప్రస్తుత వేలం విషయంలోనూ ఇదే పరిస్థితి పునరావృత్తం అవుతుందని స్థానికులు అంటున్నారు. అధికారులు నిబంధనలు పాటించడం లేదని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. దీంతో అధికారులు అధికపాటతో లీజు దక్కించుకున్న వారికి దగ్గరుండి గదులు అప్పగిస్తారా లేక గతంలో మాదిరి పాతలీజుదారు కోర్టుకు వెళ్లేలా చేస్తే పాట ఎందుకు పాడాలని ప్రశ్నిస్తున్నారు.

3 నెలల ముందు ఒట్టిదే..

దేవదాయశాఖకు చెందిన ఆస్తుల లీజు ఇచ్చే ప్రక్రియకు సంబంధించి వేలం మూడునెలలకు ముందు నిర్వహించాలన్నది నిబంధన. అయితే బి.కొత్తకోటలో నిర్వహించే వేలం ప్రకటన మార్చి 29న జరిగింది. అంటే కేవలం 12 రోజుల్లోనే వేలం నిర్వహిస్తున్నారు. దీనితో ఈ వేలంపాటలపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి పాటలను పర్యవేక్షించాలని లేదంటే ఉన్నతాధికారులు హాజరయ్యేలా తదుపరి పాట తేదీని నిర్ణయించాలని కోరుతున్నారు.

ఆ అధికారికే కట్టబెట్టారు :

ఇప్పటికే బి.కొత్తకోట ఆలయాల పరిధిలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈఓ మునిరాజకే ఈ వేలం నిర్వహణ అప్పగించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మునిరాజపై వచ్చిన వివిధ ఆరోపణలు, విధినిర్వహణలో నిర్లక్ష్యం, ఆలయ భూముల్లో అక్రమంగా ఇసుక తరలిపోవడం అంశాలపై దేవదాయ కమిషనర్ అభియోగాలను నమోదు చేసి చార్జ్‌మెమోలను జారీ చేశారు. ఇలా ఆరోపణలున్న అధికారి వేలం పారదర్శకంగా నిర్వహిస్తారా అన్నది చర్చనీయాంశమైంది. ఈ విషయమై జిల్లా దేవదాయశాఖ అధికారి విశ్వనాథ్‌ను వివరణ కోరగా వేలం నిబంధనల మేరకు మూడు నెలల ముందు నిర్వహించాలన్నారు. ఇదే విషయమై ఈఓ మునిరాజ వివరణ కోరగా అలాంటిదేమి లేదన్నారు. అధికపాటదారుకు పాతలీజుదారు గదిని ఖాళీ చేయకపోతే పాటదారుని సొమ్ము తిరిగి చెల్లిస్తామని చెప్పడం విశేషం. దీన్నిబట్టి చూస్తే వేలం ఏ మేరకు పారదర్శకంగా నిర్వహిస్తారో చూడాలి.

దేశవాళీ పంటల రకాలపై రైతులకు అవగాహన

కలికిరి: స్థానిక కేవీకే కార్యాలయంలో ఈ నెల 15న వివిధ రకాల దేశవాళీ పంటలు, రైతు హక్కుల పరిరక్షణ చట్టం-2021పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కేవీకే శాస్త్రవేత్తలు ఒక ప్రకటనలో తెలిపారు. రాయలసీమ జోన్ పరిధిలోని అన్ని జిల్లాల నుంచి దేశవాళీ పంటలను కాపాడుకుంటున్న రైతులు, రైతు సంఘాలు, ఇతర సంస్థలు కార్యక్రమానికి హాజరవ్వాలని, ఆహార ధాన్యాలు, ఉద్యాన పంటలు, పశుగ్రాసం, ఇతర పంటలు, జన్యు సంపద గల రకాలను ప్రదర్శించి అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కేవీకే కార్యాలయ మొబైల్ 8008500320 నంబరును సంప్రదించాలని కోరారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు



ప్రశంసాపత్రం అందజేస్తున్న డీఎం అమరనాథ్

మదనపల్లె సిటీ: ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని ఆర్టీసీ డిపో-2 మేనేజర్ అమరనాథ్ అన్నారు. బుధవారం స్థానిక డిపో కార్యాలయంలో గేట్ మీటింగ్ నిర్వహించి ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. డిపోకు ఆదాయం పెంచాలన్నారు. ఉద్యోగులు సమష్టిగా పని చేయాలన్నారు. కెఎంపిఎల్,ఈపీకె,ఓఆర్ అధికంగా తేవాలన్నారు. కార్యక్రమంలో సీఐ గీత సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేట్ల కోసమే వక్ఫ్ బోర్డు చట్టసవరణ

- మతసామరస్యాన్ని దెబ్బతీస్తున్న బీజేపీ
- పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి
- సీపీఐ జిల్లా కార్యదరి నరసింహులు



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

మదనపల్లె : దేశవ్యాప్తంగా లక్షల ఎకరాల వక్ఫ్ ఆస్తులను అంబానీ, అదానీ తదితర కార్పొరేట్లకు అప్పగించేందుకే బీజేపీ ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ చేసిందని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్.నరసింహులు అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ మదనపల్లి నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి పిఎల్.నరసింహులు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు పూర్తి అవుతుందని, ఈ 11 సంవత్సరాల్లో ప్రభుత్వ ఆస్తుల్ని కార్పొరేట్లకు దోచి పెట్టిందని,తమ రాజకీయ ప్రయోజనాల కోసం మతాల మధ్య చిచ్చు పెడుతూ, మతసామరస్యాన్ని దెబ్బ తీస్తూ మతవిద్వేషాలను రెచ్చగొడుతూ రాజకీయ లబ్ధి పొందుతోందన్నారు. అందులో భాగంగానే వక్ఫ్ బోర్డు చట్టాన్ని సవరణ చేశారని, దేశవ్యాప్తంగా లక్షల ఎకరాలు వక్ఫ్ ఆస్తులను అంబానీ ఆదానీ కంపెనీలకు అప్పగించడానికి చట్ట సవరణ చేశారే తప్ప ముస్లింల ప్రయోజనాల కోసం కాదన్నారు. వక్ఫ్ బోర్డులో మెజారిటీ సభ్యులు ముస్లిమేతరులను పెడుతూ,భవిష్యత్తులో వక్ఫ్ ఆస్తులను సునాయాసంగా కాజేయడానికి మార్గం సుగమం చేస్తున్నారన్నారు. ఇలాంటి దుర్మార్గమైన బిల్లులను సమర్థిస్తూ ఈ రాష్ట్రంలో ఉన్న మూడు పార్టీలు, పార్లమెంట్లో రాజ్యసభలో ఓట్లు వేశారని, ఈ మూడు పార్టీలకు ముస్లింల ఓట్లు మాత్రమే కావాలి తప్ప వాళ్ళ ప్రయోజనాల్ని ఏమాత్రం పట్టించుకోనే పరిస్థితి లేదన్నారు. వంట గ్యాస్ పైన 50 రూపాయలు పెంచారని, ప్రజలపై పన్నులు భారాన్ని పెంచుతూ, తన మిత్రులైన కార్పొరేట్ యజమానులకు కోట్ల రూపాయలు రాయితీలుగా ఇస్తున్నారన్నారు. వక్ఫ్ బోర్డ్ సవరణ చట్టాన్ని రద్దు చేసుకునేంతవరకు భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ సాంబశివ, నియోజకవర్గ కార్యదర్శి కే మురళి, రెడ్డి, సూరి, ముబారక్, శేఖర తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

మదనపల్లె : రక్తదానం ప్రాణదానంతో సమానం. ఆపదలో ఉన్న వారికి అత్యవసర సమయంలో ఆదుకునేందుకు దాతలు ఇచ్చిన రక్తం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ రాటకొండ గురుప్రసాద్ అన్నారు. బుధవారం కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 57మంది విద్యార్థులకు పైగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా గురుప్రసాద్ మాట్లాడుతూ...అన్ని దానాల కన్నా రక్తదానం చాలా గొప్పదన్నారు. విద్యార్థులు రక్తదానం చేయడం ద్వారా సమాజానికి ఎంతో మేలు చేయగలరన్నారు. రక్తదానం ప్రాణాలను కాపాడటం, ఆరోగ్యంగా ఉండటం, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు దోహదపడుతుందన్నారు. విద్యార్థుల నుంచి సేకరించిన రక్తాన్ని మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రి బ్లడ్‌బ్యాంక్‌లో అవసరమైన వారి కోసం వినియోగించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్.నవీన్‌కుమార్, స్టాఫ్‌నర్స్‌లు పీఎస్.సునీత, వనజ, టెక్నీషియన్‌లు కే.చిన్నకేశవులు, జి.ధనంజయ, టి.రెడ్డిశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ సురభి రమాదేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్.హిమశేఖర్, ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

ఉద్యాన పంటల పెంపకం పెంచండి

-ఏపీడీ నందకుమార్‌రెడ్డి



సిబ్బందితో సమీక్షిస్తున్న ఏపీడీ నందకుమార్‌రెడ్డి

బి.కొత్తకోట: ఉపాధి హామీ పథకంలో ఉద్యానవన పంటల పెంపకం పెంచడం కోసం నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఉపాధి ఏపీడీ నందకుమార్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం స్థానిక ఉపాధి ఏపీఓ కార్యాలయంలో మండలానికి చెందిన ఏపీఓ వెంకటేష్, సాంకేతిక, క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పనులపై దిశానిర్దేశం చేశారు. మండలానికి మంజూరైన 38 అభివృద్ధి పనులను వెనువెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజూ 1,304 మంది కూలీలకు పనులు కల్పించాలన్నారు. ప్రతిపంచాయతీలో జూన్ నెలాఖరుకు 25 పాంపాండ్స్ నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఫాడర్ ఉన్న రైతుల కోసం పనుల అంచనాలను సిద్ధం చేయాలని కోరారు. ఐదెకరాలలోపు భూములు కలిగిన రైతులను ఉద్యాన పంటల పెంపకం చేపట్ట కోసం వారిని గుర్తించి పథకం మంజూరు చేయాలని కోరారు. దీనికోసం అంచనాలను తయారు చేసి ప్రతిపాదనలు పంపాలని కోరారు. బడికాయలపల్లెలో నిర్మించిన నీటి తొట్టెలను పరిశీలించి పనులు బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు.

సబ్సిడీపై ఫ్రూట్ కవర్లు సరఫరా

మదనపల్లె : మామిడి పండ్లను కీటకాలు, పురుగులు ఆశించకుండా రక్షణ కోసం ఉపయోగించే ఫ్రూట్ కవర్స్‌ను ఉద్యానశాఖ ఆధ్వర్యంలో 50 శాతం రాయితీపై రైతులకు అందిస్తున్నట్లు హార్టికల్చర్ అధికారి ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...మామిడిలో ఫ్రూట్ కవర్లు వాడటం వలన నాణ్యమైన దిగుబడులు రావడంతో పాటు తామరపురుగు, తేనె మంచుపురుగు, పండు ఈగ నుంచి రక్షణ ఉంటుందన్నారు. అలాగే అధిక ఎండ, వడగండ్ల వాన నుంచి కాపాడుకోవచ్చన్నారు. మామిడితోటలో కాయలు నిమ్మకాయ లేదా కోడిగుడ్డు సైజులో ఉన్నప్పుడు గాలి చొరబడకుండా తొడిమ వరకు కట్టుకోవాలన్నారు. ఫ్రూట్ కవర్లు వాడకం వలన కాయలు మంచి సైజు రావడంతో పాటుగా ఎక్స్‌పోర్ట్ క్వాలిటీకి కావాల్సిన నాణ్యతను కలిగి ఉంటాయన్నారు. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఒక రైతుకు గరిష్టంగా 10వేల కవర్లను 50 శాతం రాయితీపై సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఫ్రూట్ కవర్స్ కావాల్సిన రైతులు ఒక కవర్‌కి రూ.1.20 పైసలు నాన్ సబ్సిడీని రైతువాటాగా చెల్లించి మదనపల్లె హార్టికల్చర్ ఆఫీస్‌లో కవర్లను పొందవచ్చన్నారు.


పూలే దంపతులకు భారత రత్న ప్రకటించాలి

– బహుజనసేన అధ్యక్షుడు శ్రీచందు



మదనపల్లె : భారతదేశ తొలి సాంఘిక సంస్కర్త, మహిళా విద్యకు ఆద్యుడు, బహుజన పితామహుడు మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలేలకు భారత ప్రభుత్వం భారత రత్న అవార్డు ఇచ్చి సత్కరించాలని బహుజనసేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు డిమాండ్ చేశారు. మహాత్మా జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా వారికిచ్చే నిజమైన నివాళి ఇదే అవుతుందని తెలిపారు. బుధవారం స్థానిక బహుజన సేన కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 11న పబ్లిక్ హాలిడేగా ప్రకటించి పూలే ఉత్సవాలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే మహారాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి పూలే దంపతులకు భారతరత్న ఇవ్వాలని కేంద్రానికి తీర్మానాన్ని పంపిందని గుర్తు చేశారు. బహుజనసేన ఆధ్వర్యంలో ఈనెల 11న మదనపల్లెలో మహాసంకల్ప ర్యాలీని ఏర్పాటు చేశామన్నారు. ర్యాలీలో అన్ని బీసీ కులాల వర్గాలు, విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి



నిసార్‌అహ్మద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన చాట్లబయన్న

మదనపల్లె : మండలంలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తామని మండల పార్టీ ఉపాధ్యక్షులు చాట్ల బయన్న తెలిపారు. బుధవారం మదనపల్లె మండల వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్ష పదవికి తనను నియమించడంపై నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదవర్గాలకు అమలుచేసిన సంక్షేమ కార్యక్రమాలు... ప్రస్తుత కూటమిప్రభుత్వ పాలనలో సంక్షేమం కుంటుపడిన విధానాన్ని ప్రజలకు వివరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్.నారాయణరెడ్డి, ఎం.మురళీ, లోకేశ్వరరెడ్డి, సురేష్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరీక్షలతో సురక్షిత మాతృత్వం

– డాక్టర్ చంద్రశేఖర్ నాయక్

పీలేరు : ఆరోగ్య పరీక్షలతో సురక్షిత మాతృత్వం సాధ్యమని డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ అన్నారు. బుధవారం తలపులలో పీఎంఎస్ఎంఏ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు కనీసం నాలుగు సార్లు డాక్టర్‌చే ఆరోగ్య పరీక్షలు చేపించుకోవాలన్నారు. పిండంలో లోపాలు, ఎదుగుదల తెలుసుకోవచ్చునని తెలిపారు. అనంతరం 26 మంది గర్భిణులకు పండ్లు, పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఈ కొండయ్య, పర్యవేక్షకులు కుసుమ, కృష్ణయ్య, ఏఎన్ఎం నాగవేణి, ప్రవీల, సీహెచ్ఓ కుముద తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుడి కుటుంబానికి న్యాయం చేయాలి



డీఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న మాజీ సైనిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు

మదనపల్లె : రెవెన్యూ అధికారుల వేధింపులకు ఆత్మహత్య చేసుకున్న మాజీ సైనికుడి కుమారుడి కుటుంబానికి న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు కోరారు. బుధవారం మదనపల్లె డివిజన్ మాజీ సైనికసంఘం అధ్యక్షులు కంచర్ల శ్రీనివాసులునాయుడు, సభ్యులతో కలిసి బాధిత మాజీ సైనిక కుటుంబాన్ని పరామర్శించారు. జరిగిన అన్యాయంపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, డీఎస్పీ దర్బార్ కొండయ్యనాయుడులను కలిసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాల్సిందిగా కోరారు. మాజీ సైనికుడి కుమారుడు ఆత్మహత్యకు కారకులైన వ్యక్తులపై కేసు నమోదుచేసి, దర్యాప్తును వేగవంతం చేయాల్సిందిగా కోరారు. వినతిపత్రాన్ని అందజేశారు. మాజీ సైనికుడి కుమారుడి భూమిని వారికే ఇప్పించి, కబ్జాకు గురైన భూమిని వేరొకచోట కేటాయించాల్సిందిగా కోరారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయంతో పాటుగా ఇంటి స్థలం కేటాయించాలన్నారు. మదనపల్లె డివిజన్ మాజీ సైనికుల సంఘం సభ్యులపై పోలీసులు నమోదుచేసిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షులు పి.విశ్వేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరెడ్డి శివకుమార్, అనంతపురం, కడప, సత్యసాయి, చిత్తూరు, కర్నూలు జిల్లాల మాజీ సైనికులు పాల్గొన్నారు.

పూలే జయంతిలో బీసీల ఐక్యత చాటాలి



బీసీ ఐక్యవేదిక సమావేశంలో పాల్గొన్న బీసీ కులాల ప్రతినిధులు

మదనపల్లె : బీసీల ఆరాధ్యదైవం మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి బీసీల ఐక్యతను చాటిచెప్పాలని బీసీ ఐక్యవేదిక నాయకులు జన్నే రాజేంద్రప్రసాద్, పొదలనరసింహులు, సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని బేబీ వెల్కం హోమ్‌లో బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో భాగంగా బీసీ కులాలకు సంబంధించి ఒకో కులం నుంచి ఒకరిని కన్వీనర్లుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీసీల సమస్యలపై కలిసికట్టుగా పోరాడాలని నిర్ణయించుకున్నారు. ఏప్రిల్ 11న జ్యోతిరావ్ పూలే జయంతిని స్థానిక బీసీ హాస్టల్‌లో విద్యార్థుల మధ్య ఘనంగా నిర్వహించాలని తీర్మానించారు. బీసీ ఐక్యవేదిక కన్వీనర్లుగా ఎన్నికైన వారిలో...జన్నే రాజేంద్ర నాయుడు, పొదలనరసింహులు, ఎం.సుబ్రహ్మణ్యం, కే.గంగులప్ప, మల్లెపల్లి సుబ్రహ్మణ్యం, చెన్నంశ్రీరాములు, టి.శ్రీదేవి, వి.వినుతాభాయి, ఎం.చంద్ర, ఎం.పీ.ఆనంద్, నాగార్జున, జి.హరినారాయణ, బడితం వెంకటరమణ, ఎన్.మణిశంకర్, పి.వెంకటరమణ, సుభాషిణి, పి.ఈశ్వరన్న, ఎన్.నరసింహులు, తిమ్మయ్య, పద్మనాభరాజు, పి.నరసింహులు, జి.చలపతి తదితరులు ఉన్నారు.

వార్షిక ప్రణాళికను సమగ్రంగా సిద్ధం చేయండి

– డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ



సిబ్బందితో సమీక్షిస్తున్న డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ

పెద్దమండ్యం: స్వయం సహాయక సంఘాలలో ఉన్న సభ్యుల జీవనోపాధిపై వార్షిక ప్రణాళికను సమగ్రంగా తయారు చేయాలని డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ అన్నారు. మండలంలోని పాపేపల్లెలో సంఘమిత్రలు, సీఆర్‌పీలు చేస్తున్న సర్వేని బుధవారం ఆయన పరిశీలించారు. సంఘాలలో ఉన్న సభ్యులకు విద్యకు, గృహాలకు, జీవనోపాధి కోసం సర్వే చేసి సమగ్రమైన ప్రణాళికను రూపొందించాలని అన్నారు. అనంతరం స్థానిక వెలుగు మండల సమాఖ్యలో సిబ్బందితో సమీక్షించారు. ప్రతి ఆరు సంఘాలకు ఒక సీఆర్‌పిని నియమించుకోవాలని సూచించారు. 2025-26 ఆర్థిక సంవత్సరం వార్షిక ప్రణాళికను సమగ్రంగా రూపొందించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. సభ్యులు తీసుకున్న రుణాలు తిరిగి చెల్లింపులపై సమీక్షించారు. సంఘాలలోని సభ్యులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం గంగరాజు, ఏపీఎం నరసింహులు, ఉన్నతి ఏపీఎం వెంకట్రమణ, సీసీలు, సంఘమిత్రలు, సీఆర్‌పిలు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డిని కలిసిన కలకడ యువత



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసిన కలకడ మైనార్టీ యువత

కలకడ : మాజీ మంత్రి, పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలకడ మైనార్టీ యూత్‌నాయకులు ముబారక్ అహమ్మద్, అమ్ము కుట్టీ కలిశారు. పెద్దాయన జారిపడి గాయపడిన విషయం తెలుసుకున్న మైనార్టీ నాయకులు, వైఎస్సార్ సీపీ యువనాయకులు బుధవారం తిరుపతిలోని ఆయన ఇంటికి వెళ్లి పుష్పగుచ్ఛం ఇచ్చి త్వరగా కోలుకోవాలని కోరుకున్నట్లు తెలిపారు.

ఎంపీ మిథున్‌ను కలిసిన ఎస్.ఏ.కరీముల్లా



ఎంపీకి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎస్.ఏ.కరీముల్లా తదితరులు

మదనపల్లె : వైఎస్సార్ సీపీ లోక్‌సభపక్షనేత, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని, పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఏ.కరీముల్లా మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. బుధవారం తిరుపతిలోని ఎంపీ నివాసంలో మిథున్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి వైఎస్సార్ సీపీ మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి పదవికి తనను ఎంపిక చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి పనిచేస్తానన్నారు.